www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450





# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక :24 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 17 శుక్రవారం, ఏప్రిల్ 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 24 | Rangareddy | Editor : Yela.Purushotham | 17 Friday , APRIL 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad


# నారీశక్తి వందన్ అధినియం దేశ చరిత్రలో ఒక కీలక మైలురాయి

- **బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు**



హైద్రాబాద్ ఏప్రిల్ 16 (నగరనిజం)నారీశక్తి వందన్ అధినియం దేశ చరిత్రలో ఒక కీలక మైలురాయి అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. చందానగర్ లో మీడియాతో మాట్లాడుతూ ఇది గతంలోనే కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చాం. మహిళల రాజకీయ సాధికారతను మరింత బలపరచాలనే దృఢ సంకల్పంతో, 2029 నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలనే సవరణను కూడా మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిందన్నారు.. దీనితో పాటు డీలిమిటేషన్ ప్రక్రియను కూడా ముందుకు తీసుకువస్తున్నాం. ఎన్నో సంవత్సరాలుగా మహిళలు కలగంటున్న సమాన ప్రతినిధిత్వం ఈ చట్టంతో సాకారం కాబోతోంది. ఈ చారిత్రక నిర్ణయం సందర్భంగా తెలంగాణ మహిళల తరఫున, రాష్ట్ర ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అదే విధంగా తెలంగాణలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మహిళల సాధికారతకు ఇది ఒక కొత్త దిశను చూపించే నిర్ణయం అని నేను నమ్ముతున్నాను. 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీసుకురావడానికి ప్రయత్నించింది. అయితే ఆ సమయంలో వారి మిత్రపక్షాలైన జనతాదళ్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు పార్లమెంట్‌లో బిల్లు ప్రతులను చించివేసి ఈ చట్టాన్ని అడ్డుకున్నాయి. అలాంటి పరిస్థితుల్లో కూడా అప్పటి కాంగ్రెస్ నాయకత్వం, ముఖ్యంగా సోనియా గాంధీ గారు, స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయలేదు. అంతకుముందు రాజీవ్ గాంధీ గారు మహిళా రిజర్వేషన్లు తీసుకువస్తామని హామీ ఇచ్చినా, ఆ హామీ అమలు కాలేదు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రవర్తనను గమనిస్తే, వారు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నట్టుగా స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తకొత్త ప్రతిపాదనల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తూ, మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ, ఇండీ అలయెన్స్ పార్టీలువ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఈ చట్టం సాధ్యమైంది. 2029 నుంచి ఇది అమల్లోకి రావడం దేశ రాజకీయాల్లో మహిళల పాత్రను విస్తృతంగా పెంచుతుంది. దేశ జనాభా 140 కోట్లకు చేరిన నేపథ్యంలో, సీట్ల సంఖ్యను కూడా సుమారు 50 శాతం మేరకు పెంచే అవకాశం కల్పిస్తోంది. అందులో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా సరైన ప్రాతినిధ్యం సాధ్యం అవుతుంది. ఈ చట్టం వల్ల ఏ రాష్ట్రానికైనా, ఏ ప్రాంతానికైనా నష్టం జరుగుతుందనే ప్రచారం పూర్తిగా తప్పుడు ప్రచారం మాత్రమే. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మకూడదని కోరుతున్నాను. మహిళల సాధికారత కోసం తీసుకువచ్చిన ఈ చారిత్రక నిర్ణయంతో మహిళళకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం కలుగుతుందన్నారు.

# మహిళా రిజర్వేషన్ల పేరిట దొడ్డి దారిలో దొరసానులను చట్టసభల్లో కూర్చోబెట్టే కేంద్ర ప్రభుత్వ యత్నం..

- **చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు కాకుండా మహిళా రిజర్వేషన్ల ఎలా సాధ్యం**
- **బీసీ మహిళలకు సబ్ కోటా లేని మహిళా రిజర్వేషన్లు అర్థరహితం**
- **బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్**



**హైద్రాబాద్ ఏప్రిల్ 16 (నగరనిజం న్యూస్):** చట్టసభల్లో బీసీ లకు (Backward Classes) రిజర్వేషన్లు ఖరారు కాకుండా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ తీవ్రంగా ఆక్షేపించారు. బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా లేకుండా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే, అది బీసీ వర్గాలపై తీవ్రమైన శాపంలా మారనుందని ఆయన పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా "దొడ్డి దారిలో దొరసానులను" చట్టసభల్లో కూర్చోబెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా చట్టసభల్లో కనీసం 27% బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణ ద్వారా ఖరారు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న జనగణన అనంతరం నిర్ధారితమయ్యే బీసీ జనాభా శాతానికి అనుగుణంగా రాజకీయ రిజర్వేషన్ల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న విధంగా హారిజాంటల్ పద్ధతిలో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా, నేరుగా వర్టికల్ విధానంలో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేయడం అవివేక నిర్ణయం అని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీసీ సమాజం ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. బీసీలకు అన్యాయం చేసే ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల్లో నిలవలేదని, భవిష్యత్తులో కూడా భూస్థాపితం కావడం ఖాయమని అన్నారు.

**శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాచమల్ల జయసింహ**

# తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం

- **రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి**
- **జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో**



**హైదరాబాద్,నగర నిజం:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామా జిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకం గా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కస రత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో

మిగతాది 2లో

## అయిత సత్యనారాయణను పరామర్శించిన నంగునూరి సత్యనారాయణ



**గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్ ,16,(నగర నిజం):** గజ్వేల్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ మాతృమూర్తి కీర్తిశేషులు అయిత నాగమణి దశదిన ఖర్మ కార్యక్రమం గురువారం అయిత సత్యనారాయణ స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ కీర్తిశేషులు అయిత నాగమణి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి, అయిత సత్యనారాయణను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు తోట బిక్షపతి,డాక్టర్ మల్లయ్య,రమేష్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ జయంతి వేడుకల్లో దళిత రత్న అవార్డుల ప్రధానం



**హైదరాబాద్, (నగర నిజం ప్రతినిధి):** భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ప్రముఖ సాంస్కృతిక వేదిక అయిన రవీంద్ర భారతీ లో నిర్వహించగా, పదముత్యం చెన్నయ్యకు దళిత రత్న అవార్డును ప్రదానం చేశారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి విశాల్ నామినేట్ చేసిన వీరికి మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ల చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం పదముత్యం చెన్నయ్య మాట్లాడుతూ తమను దళిత రత్న అవార్డుకు నామినేట్ చేసిన జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి విశాల్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్, కో-చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను కలిగించిందని, సమాజంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మరింతగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



ఉత్తర ప్రదేశ్ హోం శాఖ మంత్రి ధర్మవీర్ ప్రజాపతిని మర్యాదపూర్వకంగా కలిసిన సిరిగిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ కాసుల సురేశ్

మహేశ్వరం ఎప్రిల్ 16 (నగరనిజం)

# నర్కూడలో మౌలిక సదుపాయాల కల్పన కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తా

- **సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**
- **ఎస్సీ కాలనీలో 20 లక్షల వ్యయంతో తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టిన శేఖర్ యాదవ్**
- **కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్, ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్**



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 16 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని నర్కూడ గ్రామంలో ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మౌలిక సదుపాయాల కల్పన కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ప్రకటించారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని బస్తీలలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం తో పాటు తాగునీటి సదుపాయం కోసం కృషి చేస్తామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో 20 లక్షల వ్యయంతో తలపెట్టిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం నాడు శంకుస్థాపన చేశారు సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్. ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్, శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్ తో కలిసి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన శేఖర్ యాదవ్.... గ్రామ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని శేఖర్ యాదవ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో నర్కూడ గ్రామంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నర్కూడ గ్రామపంచాయతీ పరిధిలో అవసరమైన ప్రతి బస్తీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం తో పాటు తాగునీటి సదుపాయాన్ని కల్పించడానికి కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్, ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీలు గౌతమి అశోక్, శ్రీనివాస్, పంచాయతీ సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌటరాజు, లింగం నవీన్, బూరుకుంట నగేష్, పర్వతం వినోద్, రక్షిత్, గణేష్, శ్రీకాంత్ గౌడ్, స్థానిక నేతలు నేరటి కృష్ణ, గుండాల విశ్వనాథ్, టి కుమార్ గౌడ్, ప్రభు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లి పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



**హైదరాబాద్, ఏప్రిల్16 (నగర నిజం ప్రతినిధి):** బోయిన్‌పల్లి 119 డివిజన్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ (రిజి. నెం.161/2023) 2026–2028 కాలానికి నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జాన్ విక్టర్ సీలం తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించబడ్డాయి. నూతన కమిటీలో అధ్యక్షుడిగా బిషప్ జాన్ విక్టర్ సీలం, ఛైర్మన్‌గా రెవ. సుధాకర్ దయాడి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎ. సుధాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా రెవ. టి. శ్యామ్ కుమార్, జనరల్ సెక్రటరీగా రెవ. టి. వసంత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారిగా రెవ. ఎం. దాసన్న, జాయింట్ సెక్రటరీగా రెవ. బి. శాంసన్ నియమితులయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా రెవ. ముత్తు దినకరన్, అసిస్టెంట్ ట్రెజరర్‌గా రెవ. ఎన్. కరుణాకర్ ఎంపికయ్యారు. సలహాదారులుగా రెవ. బి. దేవసహాయం, రెవ. జి. అనిల్ కుమార్, బ్రదర్ లియోనార్డ్ మీగర్, రెవ. జె. ప్రభాకర్ రావు వ్యవహరించనున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రెవ. బి. నెహేమియా, రెవ. వి. జయరాజ్, రెవ. ఎన్. విల్సన్, రెవ. పి. ఎజ్రా ఎన్నికయ్యారు. ఫెలోషిప్ ద్వారా క్రైస్తవ సోదరభావాన్ని పెంపొందించడం, ఆధ్యాత్మిక సేవలను విస్తరించడం ప్రధాన లక్ష్యమని బిషప్ తెలిపారు. అలాగే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నూతన కమిటీ కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## యాసిడ్ తాగించి.. పిల్లాడిపై పిన్ని కర్కశం!

**మేడిపల్లి. ఏప్రిల్ 16(నగర నిజం )** ఘట్‌కేసర్: తన కొడుకును ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే కారణంతో తోడి కోడలి కుమారుడి (4)పై దారుణానికి ఒడిగట్టింది ఓ మహిళ. జ్యూస్ తాగితే చాక్లెట్ ఇస్తానని చెప్పి యాసిడ్ తాగించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన వెలుగు చూసింది. బాలుడి పరిస్థితి గమనించిన తల్లిదండ్రులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టు కింద నిఘానేత్రాలు భద్రతపై అసంతృప్తి



**మహేశ్వరం ఎప్రిల్ 16, (నగరనిజం) :** ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధి పులిమామిడిలో రహదారి పక్కనే ఉన్న స్తంభానికి బిగించి ఉన్న సీసీ కెమెరాలను, ఆ స్తంభాన్ని తొలగించే క్రమంలో తీసివేసి పక్కనే ఉన్న చెట్టుకు తాత్కాలికంగా బిగించారు. అయితే అనంతరం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, సీసీ కెమెరాలను తిరిగి ఆ స్తంభానికి అమర్చలేదు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ లేకుండా పోయి, ప్రజల్లో భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం పెరిగే అవకాశం ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తేనే నేరాల నివారణకు తోడ్పడుతాయని వారు పేర్కొంటున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, చెట్టుకు బిగించిన సీసీ కెమెరాలను తొలగించి, కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభానికి సక్రమంగా అమర్చి, ప్రజల భద్రతను కాపాడాలని పులిమామిడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నామినేటెడ్ పదవుల్లో మంచి వారికి ఆకాశం ఇవ్వండి



**హైదరబాద్ ఏప్రిల్ 16 (నగరనిజం న్యూస్)** నామినేటెడ్ పదవుల్లో మంచి వారికి ఆకాశం ఇవ్వండిఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ కోరారు. ఈ మేరకు ఏ ఐ సి సి ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను హైదరాబాదులోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు నామినేటెడ్ పదవుల్లో మంచి వారికి పార్టీకి పనిచేసిన వారితోపాటు ఇతర పార్టీల నుంచి మద్దతిచ్చిన వారికి కూడా మరియు వివిధ రంగాల్లో సేవ చేసిన సేవా దృక్పథం ఉన్నవారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రజా సంక్షేమానికి కృషి చేసే వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె చేస్తున్న సేవను ప్రత్యేకంగా ఆమె క్రమశిక్షణను, నిరాడంబరతను కొనియాడారు . వీరబొమ్మ రమేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూడా మేడమ్ ని కలిసి వినతి పత్రం సమర్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

## కుల గణన సర్వే దేశానికే ఆదర్శం

- మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



**మహేశ్వరం ఎప్రిల్ 16, (నగరనిజం) :**తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వేపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భవిష్యత్ లో రాజకీయ అవకాశాలు పెరుగుతాయని కేఎల్ఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వేను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా చేపట్టాలని కోరారు. నిపుణుల కమిటీ చేసిన సర్వే వివరాలు ప్రభుత్వ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచామని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. అత్యధికంగా ఉన్న కులాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కువ సీట్లు ఇస్తామని... ఇప్పటికే బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కేఎల్ ఆర్ తెలిపారు. వెనకబాటుతనాన్ని తగ్గించేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని కేఎల్ఆర్ కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు..



మేడిపల్లి :ఏప్రిల్ 16(నగర నిజం ): తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుం చే భానుడు తన ప్రతాపా న్ని చూపిస్తున్నాడు. దీంతో జనాలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజులు ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక ఏపీలో రానున్న మూడు రోజులు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు.

## "అరైవ్ ఆ లైవ్"లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు



**రాయికల్ ఏప్రిల్ 16(నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్ స్టేషన్ లో ప్రజా ప్రణాళికలోని "అరైవ్ ఆ లైవ్"రోడ్డు భద్రతా కార్యక్రమం భాగంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాయికల్ ఎస్సై సుధీర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతలో డ్రైవర్ల ఆరోగ్యం ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీందర్ , వైస్ ఛైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఎమ్మార్వో నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు వంట గదిలో తగిన జాగ్రత్తలు పాటించాలి





- అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించిన మహేశ్వరం అగ్నిమాపక సిబ్బంది

**మహేశ్వరం ఎప్రిల్ 16, (నగరనిజం) :** అగ్ని ప్రమాదాలతో ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్వరం అగ్నిమాపక కేంద్రం అధికారి జి నాగార్జున తెలిపారు. అగ్నిమాపక కేంద్రం వారోత్సవాల సందర్భంగా మహేశ్వరం మండలం మన్ సాన్ పల్లీ డబల్ బెడ్ రూమ్ ఆవరణలో మహేశ్వరం అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ స్టేషన్ అధికారి జి నాగార్జున ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి వాటిని ఎలా నివారించాలి ప్రమాదం సంభవించినప్పుడు ప్రజలు ఎలా స్పందించాలి అనే అంశాలపై ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వంట గదిలో ఎల్పిజి గ్యాస్ సిలిండర్ వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా 101 నెంబర్ కు కాల్ చేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్ ఏ సాయికుమార్, ఫైర్ ఫైటర్ టెక్నికల్ యు జితేందర్ రెడ్డి, ఫైర్ ఫైటర్లు గంగవరం పాండు, ఎన్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



# శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాచమల్ల జయసింహ





- రాచమల్ల జయసింహకు నియామక పత్రాన్ని అందజేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- రాచమల్ల జయసింహ ను అభినందించిన కార్తీక్ రెడ్డి
- కేసీఆర్, కేటీఆర్ తో పాటు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పిన జై సింహ

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 16(నగరనిజం ప్రతినిధి):**రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రాచమల్ల జయసింహ శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ల కు బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం నాడు జయసింహకు నియామకపు పత్రాన్ని అందజేశారు. మరోవైపు శంషాబాద్ లోని 118,119 డివిజన్లకు పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన రాచమల్ల జయసింహను ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అభినందించారు. శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి గ్రామానికి చెందిన రాచమల్ల జయసింహ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక నేతగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ గ్రేటర్ హైదరాబాద్ లో విలీనమైన నేపథ్యంలో శంషాబాద్ (118), కొత్వాల్ గూడ (119) డివిజన్లకు పార్టీ అధిష్టానం ఇప్పటికే అధ్యక్షులను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా తొండుపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత రాచమల్ల జయసింహ ను ఈ రెండు డివిజన్లకు కలిపి పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిస్తూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాచమల్ల జయసింహ.... తనపై ఎంతో విశ్వాసముంచి శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్లకు పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పదవీ బాధ్యతలు అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ అధిష్టానం తలపై ఉంచిన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా శంషాబాద్ పరిధిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని జయసింహ ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పెట్టుకొని కార్తీక్ రెడ్డి సారధ్యంలో ముందుకు సాగుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శంషాబాద్ డివిజన్ (118) అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి, కొత్వాల్ గూడ డివిజన్ (119) అధ్యక్షుడు కోనమొల్ల శ్రీనివాస్, పార్టీ కోఆర్డినేటర్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి, శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్ల మహిళా అధ్యక్షురాలు మడుపతి పరమేశ్వరి నరేందర్, కొత్వాల్ గూడ డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిన్న గండు రాజేందర్, మల్కారం సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ బూరుకుంట సతీష్, పార్టీ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నేతలు బైరమోని మల్లేష్ ముదిరాజ్, వీరమల్లు హనుమంతు ముదిరాజ్, చిలకమర్రి పరంధాములు, వెంకట్ రెడ్డి, రాచమల్ల రమేష్, రమేష్ రాథోడ్, జీవి పవిత్ర సాగర్, మడుపతి నరేందర్, గుంటి చరణ్, కుమ్మరి అర్జున్, తుప్పెర సునీల్, రాచమల్ల కార్తీక్, బక్క శ్రీకాంత్, బాత్కు మహేష్, పెట్రోల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## వేములకొండకు ఆర్టీసీ బస్సు రానుంది

- ప్రజల వినతికి సానుకూల స్పందన



**వలిగొండ, ఏప్రిల్ 16:( నగర నిజం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామం మరియు పరిసర గ్రామాల ప్రజలకు శుభవార్త అందింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న TGSRTC బస్సు సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయి.వేములకొండ గ్రామ ప్రజల తరఫున నార్కట్‌పల్లి, వాయ, అమ్మనబోల్, ఎన్నారం, రామన్నపేట ప్రాంతాల నుంచి వేములకొండకు బస్సు నడిపించి, అక్కడి నుంచి రామన్నపేట–ఎల్లంకి–సిరిపురం––చౌటుప్పల్ మార్గంలో హైదరాబాద్ వరకు ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఈరోజు నల్లగొండలో TGSRTC రీజనల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ వినతిపై స్పందించిన రీజనల్ మేనేజర్, రెండు మూడు రోజుల్లోనే వేములకొండ గ్రామానికి బస్సు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా గ్రామ ప్రజల తరఫున రీజనల్ మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ ఎస్.కె. రసూల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపలపల రాములు గౌడ్, 9వ వార్డ్ మెంబర్ సలబద్రి అభినయ్ కుమార్, పులిపాలుపుల శివ గౌడ్, స్వేరో నెట్వర్క్ జిల్లా అధ్యక్షులు ఎర్రవెల్లి నరసయ్య, గజ్జెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. బస్సు సేవలు ప్రారంభమైతే వేములకొండతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.


## అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 ( నగరనిజం ) : అన్యాయపు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిక కౌన్సిలర్ల గెలుపుతో కలిగిన అక్కసుతో, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ కక్షసాధింపులో భాగంగా వేసిన అక్రమ కేసులు కారణంగా హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పోలీస్ స్టేషన్ కు వెళ్లి జమీను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని ఒత్తిడులు తెచ్చినా, భయపడేది లేదని స్పష్టం చేశారు. తమకు న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసంతోనే హాజరయ్యామని, నిజం చివరకు గెలుస్తుందని తెలిపారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేక అధికార దుర్వినియోగంతో కేసులు పెట్టడం కాంగ్రెస్ అసహన రాజకీయాలకు నిదర్శనం అని మండిపడ్డారు. మీరు వేసే అక్రమ కేసులు, చేసే అక్రమ పనులు అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలంతా న్యాయంవైపే మొగ్గుచూపారని అన్నారు. వారివెంట మున్సిపల్ ఛైర్మన్ సుధర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## కూకట్పల్లి నియోజకవర్గానికి ప్రాధాన్యం



- యూత్ కాంగ్రెస్‌కు బండి రమేష్ పిలుపు

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 16 (నగర నిజం ప్రతినిధి):** జిల్లా పార్టీలో జరిగే ఏ నియామకంలోనైనా కూకట్పల్లి నియోజకవర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు.యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సలీం ఆధ్వర్యంలో ఇటీవల నూతన కమిటీని ఎంపిక చేయగా, ఆ కమిటీలో పదవులు పొందిన నాయకులను గురువారం కూకట్పల్లి పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ నూతన బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఎన్నిక అయినా గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి మరింతగా శ్రమించి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని, ప్రజలతో నిత్యం మమేకం కావాలని పిలుపునిచ్చారు.దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా NSUI ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 18న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం ప్రభుత్వంలో ఉన్నటువంటి అధికారులు పెట్టిన అక్రమ కేసులో నేడు కోర్టుకు హాజరైన బిజెపి నేతలు...



**గజ్వేల్ ప్రజ్ఞాపూర్, ఏప్రిల్,16,(నగరనిజం):**గత టిఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండి కూడా గజ్వేల్ ప్రజలను పట్టించుకోవడంలేదని గజ్వేల్ కి రావాలని ప్రజల ఇబ్బందులను సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన బిజెపి నాయకుల పైన అక్రమంగ కేసులు పెట్టడం జరిగింది.దాంట్లో భాగంగా నేడు గజ్వేల్ కోర్టుకు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకుడు బండారు మహేష్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రజల కోసం ప్రజల సమస్యల పైన బిజెపి నాయకులు అలుపెరుగని పోరాటం చేయడం జరిగింది అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన కేసులలో బిజెపి నాయకుల జీవితాలు సగం రోజులు కోర్టు దగ్గరే గడుస్తున్నాయి అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజల కోసం ఎన్ని కేసులైనా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చేంతవరకు ప్రజల తరఫున ప్రజా సమస్యల పైన పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా మాకు అండగా రాష్ట్ర నాయకులు ఏళ్ళ రాంరెడ్డి, కొందండం శ్రీనివాస్ రెడ్డి కోర్టు దగ్గరకు రావడం జరిగింది అన్నారు.అక్రమ కేసులో కోర్టుకు హాజరైన వారిలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్ ,నత్తి శివకుమార్, పంజాల వెంకటేష్ గౌడ్, అరికెల కరుణాకర్, బైండ్ల నాంపల్లి, కోర్టుకు హాజరవ్వడం జరిగిందన్నారు.

## మార్పుకు మార్గదర్శి సంఘసంస్కర్త కందుకూరి



**రాయికల్ ఏప్రిల్ 16 (నగర నిజం)** మార్పుకు మార్గదర్శి సంఘసంస్కర్త కందు కూరి వీరేశలింగం గారని ఆయన సామాజిక సేవా తత్పరత సాటిలేనిదని ఆచార్య పద్మశ్రీ కొలకనూరి ఇనాక్ అన్నారు .తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాష చైతన్య సమితి, సర్వేజనా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో కందుకూరి వీరేశలింగం పంతులు గారి జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి కాలంలో స్త్రీలు ఎదుర్కొన్న సామాజిక వివక్షత పై అలుపెరుగని పోరాటం చేసిన సాహితీ సంస్కర్త వీరేశలింగం పంతులు గారని కొనియాడారు.జాతీయ సారస్వత పరిషత్ కార్యనిర్వహక అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం గారి గొప్పదనాన్ని భావితరాలకు స్ఫూర్తి నివ్వాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.కవులు, రచయితలు పండితులు , ఉపాధ్యాయులు ఆ దిశగా సామాజిక చైతన్యానికి కృషి చేయాలని కోరారు. తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు బడెసాహెబ్ మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి నేటి తరం పిల్లల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడంలో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ సభ్యులు విశేషంగా శ్రమిస్తున్నారని అన్నారు అనంతరం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు కు చెందిన తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ కు కందుకూరి వీరేశలింగం పంతులు గారి స్మారక జాతీయ వాగ్దేవి పురస్కారాన్ని అందజేశారు ఆయన తోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెంది వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ఇరవైమంది ప్రముఖులకు కందుకూరి వీరేశలింగం స్మారక జాతీయ వాగ్దేవి పురస్కారాలను మెమెంటో లను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ బి.చంద్రశేఖర్, దూరదర్శన్ యాంకర్ పురాణం విజయదుర్గ కుసుమ ధర్మాన్నపీఠం చైర్ పర్సన్ రాధా కుసుమ పాలడుగు సరోజినీ దేవి మాడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్( రిటైర్) ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞ శర్మ వివిధ జిల్లాల కు చెందిన సాహితీ వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం



నిజామాబాద్ ఏప్రిల్ 16 (నగర నిజం న్యూస్)వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో నిజామాబాద్ లోని వినాయక్ నగర్ లో శ్రీ పంచ5 ముఖ ఆంజనేయ స్వామి ఆలయప్రాంగణము లోశ్రీ వాసుదేవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మీ సౌభాగ్యవతి శారద రాజేశ్వర్ దంపతులు మరియు శంకర్ కమల పర్యవేక్షణలో కోటి పార్థివలింగార్చన మహోత్సవము అత్యంత వైభవముగా జరిగినది . ముందుగా దీపారాధన, కలశస్థాపన ,గణపతి ,గౌరీపూజ ,నవగ్రహ ఆరాధన ,మరియు భక్తులు పుట్టమన్ను చేత 108 పార్థివ లింగములు చేసి ఆ శివలింగాలకు పంచామృత అభిషేకము రుద్రాభిషేకము, భస్మార్చన ,పుష్పార్చన ,బిల్వార్చన, ధూప, దీప ,నైవేద్యములతో పూజ చేసిరి. శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మరియు బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధా శ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీ నిర్మల అంబికానాథ శర్మ పూజాది కార్యక్ర మములు చేయించి మాట్లాడుతూ బాసర క్షేత్రంలో 12 జ్యోతిర్లింగాల దేవాలయం ఈశాన్య భాగమున కోటి పార్థివలిం గ స్తూపము నిర్మించినామని అందులో కోటి (పార్థివ) శివలింగములను స్థాపన చేయ దలచినామని , కోటిలో 90 లక్షల శివలింగాలను భక్తులతో చేయించడం, స్థాపన చేయడము జరిగినదని ,ఇంకా 10 లక్షలు లింగాలు చేయవలసి ఉన్నవని మరియు ఆసక్తి గల మహిళా బృందం వారు7416770841 సంప్రదించి వారి వివరాలు తెలిపినచో పుట్టమన్ను ఉచితముగా ఇచ్చి మీతో శివలింగాలు మరియు పూజ కార్యక్రమాలు చేయించి అట్టి లింగములను కోటి పార్థివలింగ స్తూపం యందు నిక్షిప్తం చేయబడును అని శర్మతెలిపినారు.. ఈ కార్యక్రమంలో శ్రీ వాసుదేవా సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మీ సౌభాగ్యవతి శారదా రాజేశ్వర్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రదోషకాల శివార్చన పార్థివలింగార్చన మిక్కిలి గొప్పదని దాని ప్రాశస్త్యం గురించి చెప్పినారు.. మరియు బాసర సరస్వతీ స్తూప పార్థివ లింగస్తుప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాధశర్మ ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. దేవాలయ పరిసర కాలిని వాసులు మరియు రుద్రంగి ప్రవీణ్, కొండ అశోక్ , శోభ అనసూయ ,తదితరులు ద్వాదశ జ్యోతిర్లింగ మందిర భూదానానికి సహకరిస్తామని అన్నారు. అని శర్మ తెలిపారు.

# కాంగ్రెస్ నేత రాచమల్ల జగన్మోహన్‌కు దళిత రత్న అవార్డు

- రవీంద్ర భారతి లో జరిగిన వేడుకలో జగన్మోహన్ కు అవార్డును అందజేసిన అంబేద్కర్ ఉత్సవ కమిటీ

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 16 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, దళిత నాయకుడు రాచమల్ల జగన్మోహన్ ను దళిత రత్న అవార్డు వరించింది. ఈ మేరకు రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన వేడుకలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ నేతలు ఈ మేరకు జగన్మోహన్ కు ఈ అవార్డును అందజేశారు. మరోవైపు తనకు దళిత అవార్డును అందజేసినందుకు గాను అంబేద్కర్ ఉత్సవ కమిటీ నేతలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు పార్టీ అధిష్టానానికి జగన్మోహన్ కృతజ్ఞతలు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ (సిద్ధాంతి) కు చెందిన జగన్మోహన్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ నాయకుడిగా కొనసాగుతున్నారు. అయితే భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో పలువురికి ప్రభుత్వం దళిత రత్న అవార్డులు ప్రకటించింది. ఇందులో భాగంగా శంషాబాద్ కు చెందిన కాంగ్రెస్ నేత రాచమల్ల జగన్మోహన్ కు దళితరత అవార్డు ను బహుకరించింది అంబేద్కర్ ఉత్సవ కమిటీ. ఈ సందర్భంగా మాట్లాడిన జగన్మోహన్ తనకు దళిత రత్న అవార్డు ప్రకటించినందుకు అంబేద్కర్ ఉత్సవ కమిటీ తోపాటు పార్టీ అధిష్టానంకు కృతజ్ఞతలు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు పార్టీ అధిష్టానానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం తన పై ఉంచిన నమ్మకానికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. దళిత రత్న అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని జగన్మోహన్ ప్రకటించారు. అదేవిధంగా బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రకటించారు.





## లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేత



**కూకునూరు పల్లి మండలం , ఏప్రిల్ ,16,(నగరానిజం):** మాత్ పల్లి గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి కి 17000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు చెక్కును అందజేసినట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ బోనాల రాజు ,జిల్లా కౌన్సిల్ మెంబర్ గౌరారం క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝర్‌వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది.కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

**బీసీ వర్గాల్లో:** షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**ఎస్సీ వర్గాల్లో:** మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# అధికార' అండ..

- అక్రమాలకు 'ఇంద్రేశం' అడ్డా!
- నిబంధనలు నడిరోడ్డుపై ఖూనీ.. మౌనమే 'మున్సిపల్' సమాధానం!
- G+2 పర్మిషన్‌తో G05 నిర్మాణాలు..
- చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు.
- కేవలం 'నోటీసుల'కే పరిమితమైన టౌన్ ప్లానింగ్ విభాగం.
- మామూళ్ల మత్తులో యంత్రాంగం..

### 'నగర నిజం' గ్రౌండ్ రిపోర్ట్.

**నగర నిజం ఏప్రిల్ 16** సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాలిటీ ఇప్పుడు అవినీతికి, అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి భారీ కట్టడాలను లేపుతుంటే, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం కావడంతో అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.

### అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి!

గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో తీసుకున్న పాత అనుమతులను అడ్డం పెట్టుకుని బిల్డర్లు అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్నారు. కేవలం G+2 (రెండు అంతస్తులు) అనుమతి తీసుకుని, దర్జాగా G+5 (ఐదు అంతస్తులు) నిర్మిస్తున్నారు. కళ్లముందే భారీ కట్టడాలు వెలుస్తున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక భారీగా 'మామూళ్లు' చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



### నోటీసులు.. లోపాయికారీ ఒప్పందాలు!

ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు లేదా ఉన్నతాధికారుల ఒత్తిడి పెరిగినప్పుడు, అధికారులు హడావుడిగా నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే, ఆ నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. నోటీసులు ఇచ్చిన కొద్దిరోజులకే బిల్డర్లతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని, నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగనిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల ఈ ద్వంద్వ వైఖరి మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా.. "మేము కలెక్టర్‌కు లేఖ రాశాం, టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇచ్చాం.. అంటూ కాలయాపన సమాధానాలు చెబుతున్నారు. పర్యవేక్షణ లోపంతో కనీస సెట్ బ్యాక్ నిబంధనలు కూడా పాటించడం లేదు. రాబోయే రోజుల్లో అగ్నిప్రమాదాలు జరిగినా, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమైనా ఈ అధికారులే బాధ్యత వహిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### కలెక్టర్ దృష్టి సారించేనా?

బాధితులు నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 'ప్రజావాణి' ద్వారా ఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని ఇంద్రేశం ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై, నిబంధనలు అతిక్రమిస్తున్న బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# శంషాబాద్ విమానాశ్రయంలో 45 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

- హైదరాబాద్ నుండి హాంకాంగ్ వెళ్తున్న ప్రయాణికుడి వద్ద కరెన్సీని స్వాధీనం చేసుకున్న సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది
- నిందితుడిని కస్టమ్స్ అధికారులకు అప్పగింత
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కస్టమ్స్ అధికారులు




**రాజేంద్రనగర్, ఏప్రిల్ 16(నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడడం కలకలం రేపింది. హైదరాబాద్ నుండి హాంకాంగ్ వెళ్తున్న ఓ ప్రయాణికుడి నుండి 45 లక్షలకు పైగా విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది. అధికారుల కథనం ప్రకారం... బుధవారం రాత్రి హైదరాబాద్ నుండి హాంకాంగ్ వెళ్తున్న ఓ ప్రయాణికుడి లగేజీ బ్యాగును సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది స్కానింగ్ చేశారు. అయితే లగేజీ బ్యాగులో 45.28 లక్షల విదేశీ కరెన్సీ ని గుర్తించిన సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది.... నిందితుడిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు.... అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగదు పట్టివేతకు సంబంధించి సంబంధిత ఐటి శాఖ అధికారులకు సమాచారం అందించారు.

## ఘనంగా మంత్రి అడ్లూరి సతీమణి కాంతా కుమారి జన్మదిన వేడుకలు



**హైద్రాబాద్ ఏప్రిల్ 16 (నగరనిజంన్యూస్) :**రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి దార కాంతి కుమారి జన్మదిన వేడుకలు మంత్రుల సముదాయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కాంతి కుమారి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు.ఈ వేడుకల్లో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది గాణ విజయ్ కుమార్, పి.ఆర్.ఓ అమృత్, పి.ఏలు ఎలుక రాజు యాదవ్, షిండే రవి కుమార్, మహంకాళి అశోక్, అడ్లూరి హరీశ్వర్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సేవాభావంతో ముందుకు సాగితేనే సమాజం అభివృద్ధి సాధ్యమని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దైవభక్తి, ధర్మబద్ధతతో జీవిస్తేనే నిజమైన సంతోషం లభిస్తుందని పేర్కొన్నారు.అలాగే ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత రంగాల్లో మరింత చైతన్యం అవసరమని పిలుపునిచ్చారు. యువత సమాజ నిర్మాణంలో ముందుండాలని, గ్రామాభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ సందర్భంగా కాంతి కుమారి ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

- ఎన్పీఆర్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 ( నగరనిజం ) :** వికలాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్ లోని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ లో వికలాంగుల హకుల జాతీయ వేదిక జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్, ఎన్పీఆర్డీ జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షులు భుజంగారెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు ప్రమోద్, జంగయ్య, మురళీ, రాఘవేందర్, యాదయ్య, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై అవమానకర వ్యాఖ్యలు

- బీజేపీ ఎంపీపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం, క్షమాపణ డిమాండ్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16 (నగర నిజం ప్రతినిధి):**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై బీజేపీ ఎంపీ తెజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు.ఆ ప్రెస్ నోట్‌లో ఆయన మాట్లాడుతూ–తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్తాన్ దేశ విభజనతో పోల్చడం అత్యంత బాధాకరమని, ఇది పూర్తిగా బాధ్యతారహితమైన మరియు రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన వ్యాఖ్య అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం విభజన భావజాలం వల్ల ఏర్పడలేదని, ఇది దశాబ్దాల పాటు సాగిన ప్రజా పోరాటం, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు మరియు వేలాది అమరవీరుల త్యాగాల ఫలితమని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రం ఒక రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ద్వారా, భారత పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. అలాంటి చారిత్రాత్మక మరియు ప్రజాస్వామ్య నిర్ణయాన్ని దేశ విభజనతో పోల్చడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, వారి త్యాగాలను అవమానించడం అని తీవ్రంగా విమర్శించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా లోక్‌సభలో తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ, బీజేపీ నాయకుల దృక్పథం ఎప్పటినుంచో తెలంగాణ పట్ల అనుకూలంగా లేదని ఆరోపించారు.ఇంకా ఆయన మాట్లాడుతూ–తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం మరింత బాధాకరమని, ఇది వారి మౌన సమ్మతిగా భావించాల్సి వస్తుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, భావోద్వేగాలు, చరిత్ర పట్ల బీజేపీకి గౌరవం లేదని ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ తరపున ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే తెజస్వీ సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ప్రతి ఒక్కరిపై తమకు అపార గౌరవం ఉందని, వారి త్యాగాలను ఎవరైనా చిన్నచూపు చూడటాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని మదన్ మోహన్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు చేసిన బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE